క్లుప్తంగా

కాలువల పునరుద్ధరణ



కమ్మర్‌పల్లి: మండలంలోని నాగాపూర్‌లో ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.30 లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న ఊరచెరువు తూము, కాలువల పునరుద్ధరణ పనులను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయమ్మ, ఎంపీటీసీ సుప్రియ, వీడీసీ అధ్యక్షుడు బసకొండ మహేశ్, ఆయకట్టు నీటి పారుదల అభివృద్ధి అధ్యక్షుడు ఎలిగేటి గణేశ్, ఫౌండేషన్ ప్రతినిధి చింత శ్రీనివాస్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో రాణించాలి



ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు పట్వారి గోపీకృష్ణ అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో అండర్–12 క్రికెట్ మ్యాచ్ పోటీలు కొనసాగుతున్నాయి. సోమవారం నాటి మ్యాచ్‌లలో పాల్గొన్న క్రీడాకారులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జ్యూస్ బాటిళ్లు, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పట్వారి తులసీ, కోశాధికారి లక్ష్మీనారాయణ, సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా విజయ్



ఆర్మూర్‌టౌన్: యువజన కాంగ్రెస్ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడిగా విజయ్ అగర్వాల్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు విఘ్నేశ్‌యాదవ్ జారీ చేసిన నియామకపత్రాన్ని, కాంగ్రెస్ అభ్యర్థి వినయ్‌రెడ్డి సోమవారం విజయ్‌కి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



మాక్లూర్: విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని విజయ్ రూరల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గణేశ్ అన్నారు. మండలంలోని దాస్‌నగర్ వద్ద ఉన్న వీఆర్‌ఈసీలో సోమవారం ఫ్రెషర్స్ డేను నిర్వహించారు. సీనియర్లు జూనియర్ విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని సూచించారు. ఇంజినీరింగ్ విద్యతో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, కళాశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి, సీఈవో అమృతలత విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాపై నిరసన



నవీపేట : మండల కేంద్రంలోని నిజాంసాగర్ కాలువ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైందని ఆవేదన వ్యక్తం చేస్తూ వార్డు సభ్యురాలు శోభ దంపతులు సోమవారం నిరసన తెలిపారు. కబ్జాకు గురైన స్థలంలో ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా శోభ మాట్లాడుతూ.. కబ్జాపై ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జాలను తొలగించే వరకు నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఘనంగా గురునానక్ జయంతి

నిజామాబాద్ సిటీ: నగరంలోని గాజుల్‌పేట్ ప్రధాన గురుద్వార్‌లో సోమవారం గురునానక్ జయంతిని సిక్కులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గురుద్వార్ నుంచి గాంధీచౌక్ వరకు, అక్కడి నుంచి తిరిగి గురుద్వార్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో సిక్కు యువకులు చేసిన విన్యాసాలు అకట్టుకున్నాయి. గురుద్వార్‌లో మతపెద్దలు గురుగ్రంథ్‌ను పఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళాకారులు భజనలు నిర్వహించారు.

తెలంగాణలోనే నిరంతర విద్యుత్

- 24 గంటలపాటు కరెంట్ సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదే..
- రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ కవిత



బెల్లాల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత



ఊట్‌పల్లిలో రోడ్ షోకు హాజరైన ప్రజలు

బోధన్‌రూరల్/రెంజల్(బోధన్) : దేశంలో 24 గంటలపాటు నిరంతర విద్యుత్‌ను అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బోధన్ మండలం బెల్లాల్, అమ్దాపూర్, ఊట్‌పల్లి, సంగం, పెంటాకుర్దు, సాలూర కేంద్రంతోపాటు హున్సా గ్రామాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి షకీల్‌కు మద్దతుగా కవిత సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రెంజల్ మండలం సాటాపూర్, నీలా, పేపర్‌మిల్, కందకుర్తి గ్రామాల్లో సోమవారం రాత్రి నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీతోపాటు ఎమ్మెల్యే షకీల్‌కు ఆయా గ్రామాల్లో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ లేఖలు, ఫిర్యాదులతోనే రైతుబంధు, రైతు రుణమాఫీకి అడ్డంకులు వచ్చాయన్నారు. డిసెంబర్ 3న రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తుందని, అధికారంలోకి రాగానే రైతుబంధు ఇవ్వడంతోపాటు రుణమాఫీని పూర్తి చేస్తామన్నారు. కౌలు రైతులకు, రైతు కూలీలకు రైతుబంధు ఇవ్వడం ఎలా సాధ్యమో కాంగ్రెస్ చెప్పాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు అమలు ఉద్దేశం లేదు కాబట్టే కాంగ్రెస్ పార్టీ అమలుకు సాధ్యం కాని హామీలు ఇస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలను మభ్య పెడుతోందని, కాంగ్రెస్ చేసే మోసాన్ని పసిగట్టాలని సూచించారు. రాష్ట్రం మరింత అభివృద్ధిపథంలో ముందుకు సాగాలంటే బీఆర్‌ఎస్ అధికారంలో ఉండాలన్నారు. తెలంగాణ రాకముందు సాగునీటి కోసం, కరెంటు కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఆ పరిస్థితి సీఎం కేసీఆర్ పారద్రోలారన్నారు. సీఎం కేసీఆర్ రైతుబంధును ప్రవేశపెట్టిన తర్వాత సుమారు 15 రాష్ట్రాలు ఆయా పేర్లతో ఈ తరహా పథకాన్ని అమలు చేస్తున్నాయని, మన పథకాలను కాపీ కొట్టి కేంద్ర ప్రభుత్వం కూడా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. బోధన్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి ఇరిగేషన్ శాఖ మంత్రిగా పనిచేసి రైతులకు ఏం చేశారని ప్రశ్నించారు. కనీసం తాగునీటిని అందించే ప్రయత్నం చేయలేదన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో షకీల్ అనేక పనులు చేశారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలో పేర్కొన్న వాటన్నింటినీ అమలు చేస్తామని, రానున్న ఐదేళ్లలో పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణం చేపడుతామన్నారు. సీఎం కేసీఆర్ మాటంటే మాటేనని, చెప్పినవి చేసి చూపించారని పేర్కొన్నారు. బోధన్‌లో ఎన్‌ఎస్‌ఎఫ్ భూముల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు.

అందరికీ అండగా నిలుస్తా

బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే షకీల్ మాట్లాడుతూ.. తనకు మరోసారి అవకాశం కల్పించాలని, అందరికీ అండగా ఉంటానని అన్నారు. బోధన్ నుంచి మూడుసార్లు గెలిచిన సుదర్శన్‌రెడ్డికి బోధన్‌లో ఇల్లు కూడా లేదని విమర్శించారు. రాష్ట్రంలో, బోధన్‌లో బీఆర్‌ఎస్ ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బుద్దె సావిత్రి, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ గంగారెడ్డి, బోధన్, సాలూర మండలాధ్యక్షులు సంజీవ్, నర్సన్న, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోధన్‌లో రోడ్ షో ...

బోధన్‌టౌన్(బోధన్): బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి బోధన్ పట్టణంలో ఎమ్మెల్సీ కవిత రోడ్ షో నిర్వహించారు. వేలాదిమందితో ఎమ్మెల్యే షకీల్ ఇంటి నుంచి రోడ్‌షో ప్రారంభమైంది. శక్కర్‌నగర్ చౌరస్తా మీదుగా కొత్త బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, పాత బస్టాండ్ నుంచి పాత పోస్టాఫీసు వరకు వరకు కొనసాగింది. పట్టణ అధ్యక్షుడు రవీందర్‌యాదవ్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వార్థంతోనే ఉద్యమకారుల అవతారం

- బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి విమర్శ



నవీపేటలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

నవీపేట: అక్రమ సంపాదన కోసం స్వార్థంతోనే సీఎం కేసీఆర్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులు తెలంగాణ ఉద్యమకారుల అవతారం ఎత్తారని బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని నాగేపూర్, మద్దెపల్లి, ఎల్‌కె ఫారం, రాంపూర్, ఫతేనగర్, నవీపేటలో సుదర్శన్‌రెడ్డి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుకున్నది సాధించిన కల్వకుంట్ల కుటుంబం అక్రమ సంపాదనతో కోట్లు గడించిందని విమర్శించారు. పదేళ్లు దోచుకున్నది చాలదన్నట్లు మళ్లీ సిద్ధమయ్యారని, వారికి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదన్నారు. కాంగ్రెస్ పార్టీకి లభిస్తున్న ఆదరణను జీర్ణించుకోలేక తమ కార్యకర్తలను వేధిస్తున్నారని, సహించేది లేదని హెచ్చరించారు. ప్రచారానికెళ్తున్న కాంగ్రెస్ కార్యకర్తలను బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారంటీ పథకాలతో ముందుకెళ్తున్న కాంగ్రెస్‌ను ఢీకొనడం ఎవరితరం కాదని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సులను రద్దు చేశారని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బస్సుల రాకపోకలను పునరుద్ధరిస్తామన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉంటుందని, ఆసరా పింఛన్లను పెంచుతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ నాయకులు తాహెర్, శరత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సాయారెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, భగవాన్, గోపాల్, బాబు, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా ఎన్నికల ప్రచారం



బాల్కొండలో ప్రచారం చేస్తున్న నీరజరెడ్డి



వర్నిలో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

బాల్కొండ/వర్ని: పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో ఆయా పార్టీల అభ్యర్థులకు మద్దతుగా నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. బాల్కొండ మండల కేంద్రంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా ఆయన సతీమణి నీరజరెడ్డి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేసిన అభివృద్ధిని చూసి ప్రశాంత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. వర్ని మండల కేంద్రంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా పార్టీ నాయకులు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. మల్లారం నుంచి మండల కేంద్రం చుట్టుపక్కల 12 గ్రామాల్లో ద్విచక్ర వాహన ర్యాలీ కొనసాగింది.

అర్హులందరికీ పింఛన్లు, రేషన్‌కార్డులు

- బీజేపీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ



ప్రజలకు అభివాదం చేస్తున్న అన్నపూర్ణమ్మ



ప్రచారానికి హాజరైన మహిళలు

కమ్మర్‌పల్లి: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే అర్హులందరికీ పింఛన్లు, రేషన్ కార్డులతోపాటు ఇండ్లు ఇప్పిస్తానని బాల్కొండ బీజేపీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ అన్నారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో అన్నపూర్ణమ్మ సోమవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కమ్మర్‌పల్లిలో డబుల్ బెడ్ రూం ఇళ్ల మంజూ రు, పంపిణీలో బీఆర్‌ఎస్ నాయకులు పెద్ద ఎత్తున కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో అవినీతి పెరిగిపోయిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులు ఊసరవెల్లి రంగులు మార్చినట్లు పార్టీలు మారుతున్నారని విమర్శించారు. ఎన్నికల అనంతరం కాంగ్రెస్ నాయకులు పార్టీ మారబోమని గ్యారెంటీ ఇవ్వగలరా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తేనే ప్రతి వ్యక్తికి న్యాయం జరుగుతుందన్నారు. బీజేపీ ప్రకటించిన మేనిఫెస్టోతో ప్రతిపక్షాల దిమ్మదిరిగిపోయిందని విమర్శించారు. మేనిఫెస్టోతో అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా ఉందని ప్రజలు ఆలోచించాలని కోరారు. అవినీతి రహిత పాలనే బీజేపీ ధ్యేయమన్నారు. అంతకుముందు మహిళలు బోనాలతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కట్ట సంజీవ్, నా యకులు రెంజర్ల గంగాధర్, చింత ప్రవీణ్, కొత్తపల్లి అరుణ్, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు ఇందూరి గంగామణి పాల్గొన్నారు.

మైనారిటీల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తా

- ఆర్మూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

మాక్లూర్: గెలిపిస్తే మైనారిటీల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని ఆర్మూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి మైనార్టీలకు హామీ ఇచ్చారు. సోమవారం రాత్రి మాక్లూర్ మండల కేంద్రంలో నిర్వహించిన మైనారిటీల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గెలిచిన రెండు పర్యాయాలు మైనారిటీ ప్రజల అభివృద్ధికి కృషి చేశానని గుర్తు చేశారు. షాదీముబారక్ ద్వారా ఆర్థిక సాయంతోపాటు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పెద్ద సంఖ్యలో ఇప్పించానని తెలిపారు. మజీద్‌లు లేనిచోట స్థలాలు ఇప్పించి నిర్మించి ఇచ్చిన ఘనత కూడా తనదేనన్నారు. మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ విఠల్‌రావు మాట్లాడుతూ.. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక మైనార్టీ నాయకులు కోకా హైమద్, కరీం, తాజొద్దీన్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం



దూదిగాంలో తడిసిన ధాన్యం

బాల్కొండ: ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఉదయం మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో నూర్పిళ్లు చేసి రోడ్లపై ఆరబెట్టిన వరి ధాన్యం తడిసింది. మెండోరా మండలం పోచంపాడ్, బుస్సాపూర్, దూదిగాం గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోయింది. మరో రెండు రోజులపాటు చిరు జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో పోచారం శ్రీనివాస్‌రెడ్డి

వర్ని: మండలంలోని చిలక తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గడే శంకర్‌తోపాటు పలువురు బాన్సువాడ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులకు శ్రీనివాస్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. గంగాధర్, మూడు సాయిలు, కన్నా శంకర్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు రాజకీయ చైతన్యం సాధించాలి

ఇందల్వాయి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రాజకీయ కుట్రకు ముదిరాజ్‌లు బలవుతూనే ఉన్నారని, ఇకనైనా మేల్కొని రాజకీయ చైతన్యం సాధించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ధర్పల్లి మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి పిలుపునిచ్చారు. ఇందల్వాయి మండల కేంద్రంలో ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ముదిరాజ్‌లను, వారి సమస్యలను విస్మరించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు కుల గణన హామీ ఇచ్చి, మూడు ఎమ్మెల్యే టికెట్‌లు కేటాయించిన కాంగ్రెస్ పార్టీకే ముదిరాజ్‌లు మద్దతు తెలపాలన్నారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి



బ్రాహ్మణపల్లి శివారులో పిట్ల కృష్ణమహరాజ్‌కు స్వాగతం పలుకుతున్న భక్తులు



ఆర్మూర్ నవసిద్ధులగుట్టపై పల్లకీసేవ



కందకుర్తి పుష్కర క్షేత్రంలో భక్తులు



ఆర్మూర్‌లో దీపదానం చేస్తున్న చిన్నారులు

సాక్షి నెట్‌వర్క్ : కార్తీక పౌర్ణమిని భక్తులు సోమవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. తులసీవివాహాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మల్లారం పిట్ల కృష్ణమహరాజ్ కందకుర్తి త్రివేణి సంగమానికి పాదయాత్ర చేశారు.ఆయా గ్రామాల్లో భక్తులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. త్రివేణి సంగమంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీసేవలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని శివాలయంలోని లింగానికి పంచామృతంతో అభిషేకం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. పట్టణంలోని లక్ష్మీనారాయణ, లక్ష్మీనర్సింహస్వామి, జంబిహనుమాన్, శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ముప్కాల్ మండల కేంద్రంలో పడిలేచిన మర్రిచెట్టు వద్ద, కొత్తపల్లిలో, మెండోరా మండలం పోచంపాడ్ కోదండ రామాలయం, శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రూర్ మండల కేంద్రంలోని రాజరాజేశ్వర స్వామి, వీరభద్ర స్వామి, విఠలేశ్వర స్వామి ఆలయాలతోపాటు గైని గుట్ట స్వయం భూబసవేశ్వర స్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. శివలింగాలకు అభిషేకాలు చేశారు.



ముప్కాల్ మండలం కొత్తపల్లిలో..



రుద్రూర్ విఠలేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

వినయ్‌రెడ్డికి పట్టం కట్టాలి

- కాంగ్రెస్ నాయకురాలు, సినీనటి విజయశాంతి



ఆర్మూర్‌లో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న విజయశాంతి

ఆర్మూర్ టౌన్ : అసెంబ్లీ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వినయ్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ నాయకురాలు, సినీనటి విజయశాంతి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని 13, 32, 33, 34, 35 వార్డుల్లో సోమవారం రాత్రి నిర్వహించిన స్ట్రీట్ కార్నర్‌మీటింగుల్లో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో కుటుంబ పాలనను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటేనని, ఆ రెండు పార్టీలను తరిమికొట్టాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను పెండింగ్‌లో పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు. కేసీఆర్ కుటుంబం రూ.10 లక్షల కోట్ల వరకు సంపాదించిందని, రాష్ట్రానికి రూ.ఆరు లక్షల కోట్ల అప్పు అంటగట్టిందని ఆరోపించారు. రూ.1600 కోట్లతో నూతన సచివాలయం కట్టిన కేసీఆర్.. పేదలకు కనీసం డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – మంగళవారం (తెలుగు)- 12.25, 7.00
టైగర్-3 (తెలుగు)-3.35, 10.10

స్క్రీన్-2 – ఆదికేశవ (తెలుగు)- 11.00, 1.50, 4.40, 7.30, 10.20

స్క్రీన్-3 – కోటా బొమ్మాళి పీఎస్ (తెలుగు)- 10.00, 1.00, 7.10, 10.10
మంగళవారం (తెలుగు)- 4.00

స్క్రీన్-4 – టైగర్-3 (హిందీ)- 10.15,
మాధవే మధుసూదనా (తెలుగు) 4.00
సౌండ్‌పార్టీ(తెలుగు)7.00
పర్‌ఫ్యూమ్ (తెలుగు) 9.45

రైతు బాగుండాలంటే కేసీఆర్ రాజ్యం రావాలి

బోధన్‌టౌన్(బోధన్): రైతులు బాగుండాలంటే కేసీఆర్ రాజ్యం రావాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. బోధన్ పట్టణ శివారులోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో సోమవారం నిర్వహించిన కమ్మవారి ఆత్మీయ సమ్మేళనంలో కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ఆవిర్భావం తరువాత రైతుల కష్టాలు దూరమయ్యాయని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాగుకు 24గంటల విద్యుత్ సరఫరా చేయడంతోపాటు రైతుబంధు ఇచ్చి ఆదుకుంటున్నదన్నారు. రైతుబీమాతో రైతన్నల కుటుంబాలకు సీఎం కేసీఆర్ అండగా నిలిచారన్నారు. నీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేసిన మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి నియోజక వర్గంలోని సాగునీటి కాలువలను విస్మరించారని విమర్శించారు. ఎమ్మెల్యే షకీల్ సాగునీటి కాలువలతోపాటు చెక్‌డ్యాముల పనులు చేపట్టి రైతన్న కష్టాలను తీర్చారన్నారు. సాధ్యం కాని హామీలు ఇచ్చి రేవంత్ రెడ్డి మభ్యపెడుతున్నారని, కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి షకీల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పూదోట రవికిరణ్, జాడి సర్పంచ్ జ్యోతి, మద్ది నేని శ్రీనివాస్, బొల్లెపల్లి సుశీల, కృష్ణప్రసాద్, శ్రీదేవి, రాము, కౌన్సిలర్ నాగజ్యోతి, సొసైటీ చైర్మన్లు దాసి అంతయ్య, మెట్ల రవీంద్ర బాబు, వెంకట్రావ్, ఉమామహేశ్వర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.